క్లుప్తంగా

వారపు సంతలో అన్నదానం


అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చంద్రగిరి: స్థానిక వారపు సంతలో ఆదివారం రైతులు, వ్యాపారులు, ప్రజలకు తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సుమారు 500 మందికి అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఆదివారమూ వారపు సంతలో అన్నదానం చేస్తున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ఎన్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర


ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న ఐసర్ డైరెక్టర్, ఎన్‌ఎస్‌యూ వీసీ

తిరుపతి సిటీ : సమాజ సేవలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) కీలక పాత్ర పోషిస్తోందని ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య తెలిపారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన వీసీ జీఎస్‌ఆర్ క్రిష్ణమూర్తితో కలిసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ సమాజ సేవకు అంకితం కావాలని సూచించారు. గత ఏడాదిగా విశ్వవిద్యాలయం తరపున ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చేసిన సేవా కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ టీవీ రాఘవాచార్యులు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఎ.చందూలాల్, సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల దత్తత గ్రామాలైన వెంకటాపురం, అన్నాస్వామిపల్లెలోని విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతిఫలం ఆశించకుండా సమాజసేవ చేయడమే ఎన్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చంద్రయ్య, సుజన్ కుమార్, రఫీ కిరణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌లో రాణిస్తున్న చిన్నారి చాందిని


చాందినిని అభినందిస్తున్న కోచ్ తదితరులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(పడమర)లో 5వ తరగతి చదువుతున్న మోటుపల్లి చాందిని టెన్నిస్ క్రీడలో రాణిస్తోందని హెచ్‌ఎం పి.నాంచారయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాలిక తిరుచానూరు ఆర్‌ఆర్ టెన్నిస్ కోర్టులో కోచ్ కిరణ్ వద్ద శిక్షణ పొందుతోందని తెలిపారు. శనివారం ఉదయం శ్రీకాళహస్తిలో వైఎస్‌ఆర్ ట్రోఫీ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా చాంపియన్‌షిప్(ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు)లో అండర్–10 విభాగంలో చాందిని పాల్గొని రన్నర్‌గా నిలిచిందని వివరించారు. 2021లో విజయవాడలో జరిగిన రిపబ్లిక్ డే కప్ చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిందని వెల్లడించారు. మరోసారి సౌత్ ఇండియా చాంపియన్‌షిప్‌లో రన్నర్‌గా నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. బాలికను ఆదివారం అభినందించారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పాకాల: దామలచెరువు సత్రం, పాటూరు సమీపంలోని వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు ఆదివారం లయన్ ఆర్.దొరస్వామి అన్నదానం చేశారు. ఆయన కుమారుడు ఆర్.గిరిబాబు పుట్టిన రోజును అక్కడ జరుపుకున్నారు. లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ విజయబాబు, సభ్యులు రఘునాథ నాయుడు, కృష్ణమూర్తి, రామయ్య, దొరస్వామి నాయుడు, తులసీరామన్, ధనుంజయ, మహేష్‌బాబు, భాస్కరన్ పాల్గొన్నారు.


ఆకట్టుకుంటున్న స్వామి వారి తలపాగాలు






కళాకారుల కళా ప్రదర్శనలు





శోభాయమానం.. స్నపన తిరుమంజనం

తిరుమల: రంగురంగుల గాజులు, ఆప్రికాట్ ఫలాలు, వట్టివేరు, కురువేరు, రోజామాలలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి స్నపన తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు వరకు అర్చకస్వాములు వేద మంత్రోచ్ఛరణల మధ్య స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపనిషత్తు, దశ శాంతి మంత్రములు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం, వేదాలను పారాయణం చేశారు. తిరుమల పెద్ద జీయంగార్, తిరుమల చిన్న జీయంగార్ వివిధ పాశురాలను పఠించారు. ఈ వేడుకలో రంగురాళ్లతో కూడిన గాజుల మాలలు, ఆప్రికాట్ మాలలు, వట్టివేరుమాలలు, కురువేరుమాలలు, రంగురంగుల రోజామాలలు, పసుపు రోజామాలలు, మిక్సడ్ డ్రైఫ్రూట్స్ మాలలు, తెలుపు ముత్యాల మాలలు, కిరీటాలు, తులసి మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ మాలలను తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన రాజేందర్ విరాళంగా అందించారు. అదేవిధంగా హైదరాబాదుకు శ్రీహరి, శ్రీధర్, శ్రీనివాస్ విరాళంతో రంగనాయకుల మండపంలో సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్లతో విశేషంగా అలంకరించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సూర్యప్రభ వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి, జేఈవో తదితరులు




కళాప్రదర్శనలు


స్వామి వారికి అలంకరించేందుకు తెచ్చిన దండలు

వేడుకగా వినాయక నిమజ్జనం



తిరుపతి రూరల్ : మండలంలోని వేమూరులో వినాయకుడి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను ఆదివారం వేలం వేశారు. గ్రామానికి చెందిన దుగ్గి వెంకటేశ్వర్లు నాయుడు రూ.77 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు.


నిమజ్జనాన్ని తిలకించేందుకు వినాయక సాగర్ వద్దకు వచ్చిన ప్రజలు

తిరుపతి మంగళం : వినాయక చవితి పండుగ సందర్భంగా తిరుపతి నగరంలో పలుచోట్ల వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. మూడవ రోజు పలు విగ్రహాలను వినాయక సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఏడో రోజు ఆదివారం సుమారు వందకు పైగా భారీ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి వినాయకసాగర్‌లో నిమజ్జనం చేశారు. నిమజ్జనాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

శానంబట్లలో

చంద్రగిరి: మండలంలోని పాతశానంబట్లలో ఆదివారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న టి.జయశ్రీ, ఎం.పావని, ఎం.చాందిని, డి.శ్రీనిజ, వి.భారతం, వి.కేశవన్, కె.పార్థు, కె.నవీన్, కె.అనిల్ తదితరులు సంయుక్తంగా వినాయక చవితి సందర్భంగా గ్రామంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 5వ రోజు గణపతి హోమం, నవగ్రహ శాంతి హోమం నిర్వహించారు. ఏడో రోజు భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారం సాయంత్రం గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


శానంబట్లలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న యువతీయువకులు


నెహ్రూవీధిలో ఏర్పాటుచేసిన వినాయకుడు




నిమజ్జనానికి వినాయక సాగర్ వద్దకు తీసుకువచ్చిన వినాయకుడి విగ్రహాలు

నయనానందకరం.. సాంస్కృతిక విన్యాసం


మహతి కళాక్షేత్రంలో కళాకారుల ప్రదర్శన

తిరుపతి కల్చరల్: తిరుపతి నగంలోని వివిధ కళా వేదికలపై ఆదివారం రాత్రి కళాకారులు ప్రదర్శించిన వాయిద్య, సంగీత, నృత్య విన్యాసాలు నయనానందకరంగా సాగాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆదివారం మహతిలో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ప్రదర్శించిన సంగీత వాయిద్య సమ్మేళనం శ్రవణానందకరంగా సాగింది. అన్నమాచార్య కళామందిరంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల జి.జ్ఞానప్రసూన బృందం వీణా వాయిద్య సంగీతం అలరించింది. సి.హరినాథ్ బృంద కళాకారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. రామచంద్ర పుష్కరిణి వేదికపై కొండపల్లి ఉదయ్‌కుమార్ ఆలపించిన హరికథా గానం అలరింపజేసింది.

గుండెపోటుతో భక్తుడి మృతి

తిరుమల: శ్రీవారి దర్శనానికి వెళ్తూ ఆదివారం ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన నరసప్ప (60) కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం గుండెపోటు వచ్చింది. తిరుమలలో ప్రథమ చికిత్స అందించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఘనంగా 5కే వాక్‌థాన్

తిరుపతి కల్చరల్ : ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఆదివారం అమర హాస్పిటల్ ఆధ్వర్యంలో తిరుపతిలో 5కే వాక్ థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అలిపిరి వద్ద ఏఎస్పీ జక్కా కులశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. వాక్‌థాన్ అలిపిరి నుంచి ఎస్వీ జూ పార్క్ వరకు సాగింది. ఆయన మాట్లాడుతూ గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గొరినేని మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, నిద్రలేమి లేకుండా చూసుకోవాలన్నారు. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా హెల్త్ హార్ట్ ప్యాకేజీ రూ.699లకే అందిస్తున్నట్లు తెలిపారు. దీనిలో ఈసీజీ, 2డీ ఇకో, హిమోగ్లోబిన్, ఎఫ్‌బీఎస్, పీపీబీఎస్, క్రియాటినైన్, కొలెస్ట్రాల్, కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ ఉంటుందని తెలిపారు.


5కే వాక్ థాన్‌ను ప్రారంభిస్తున్న ఏఎస్పీ జక్కా కులశేఖర్, అమర హాస్పిటల్ అధినేత

2,500 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 2500 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్టు టీటీడీ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఆమె ఆదివారం తిరుమల రాంభగీచా–2లోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో 243 మందిని, గరుడసేవ రోజు 774 మందిని అదనంగా ఏర్పాటు చేశామన్నారు. గరుడసేవనాడు 136 టన్నుల చెత్తను తొలగించామన్నారు. రథోత్సవం నాడు మాడ వీధుల్లో ఇసుకను తొలగించేందుకు అదనంగా 278 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కర్నూలులోని రీజనల్ ప్రయోగశాల, తిరుమలలోని టీటీడీ ఆహార ప్రయోగశాల నిపుణులు తిరుమలలోని తాగునీరు, ఆహార నాణ్యతను పరిశీలిస్తున్నట్టు తెలిపారు.

ఆరు రోజుల్లో 23,230 మందికి వైద్యసేవలు

బ్రహ్మోత్సవాల ఆరు రోజుల్లో 23,230 మంది భక్తులకు వైద్యసేవలందించినట్టు టీటీడీ ఇన్‌చార్జి సీఎంవో డాక్టర్ నర్మద తెలిపారు. ఆమె ఆదివారం మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ భక్తులకు వైద్యసేవలందించేందుకు తిరుమలలో అశ్విని ఆసుపత్రితోపాటు ఆరు డిస్పెన్సరీలు, ఆరు ప్రథమ చికిత్స కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల కోసం అదనంగా 8 ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తుల కోసం 24 గంటల పాటు 13 అంబులెన్సులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. గరుడ సేవ నాడు 4800 మందికి వైద్యసేవలందించామని, మాడ వీధుల్లో బ్యాటరీ వాహనాల్లో దాదాపు 10 వేల మందికి మందులు పంపిణీ చేశామని తెలిపారు. చక్రస్నానం రోజు వరాహస్వామి ఆలయం వద్ద వైద్యబృందంతోపాటు అంబులెన్సును అందుబాటులో ఉంచుతామని, నూతన పరకామణి భవనం వద్ద మరో అంబులెన్సు ఉంటుందని తెలిపారు.